క్లుప్తంగా...

ఆశీర్వచనం



సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్‌ను యాదాద్రి దేవస్థాన వేద పండితులు కాళ్లూరి వెంకటాచార్యులు ఆశీర్వదించారు. శుక్రవారం నేరెడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో సీపీని స్వామి వారి ప్రసాదం అందించారు. యాదాద్రి దేవస్థాన పరిరక్షణకు అవసరమైన అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

అభినందనల వెల్లువ



కమిషనర్‌కు అభినందనలు తెలుపుతున్న అధికారులు

బోడుప్పల్: బోడుప్పల్ కమిషనర్ ఎ.వాణిరెడ్డి గ్రేడ్-1 కమిషనర్ నుంచి స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా నగర పాలక సంస్థ అధికారులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతి వల్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు. నగర ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అధికారులు, ప్రజలు అందుకు సహకరించాలని కోరారు. సన్మానించిన వారిలో మేనేజర్ మంజులత, డీఈలు, శ్రీలత, శారద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కోట వెంకటేశ్వర్లు, టీపీఓ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ కేంద్రం ప్రారంభోత్సంలో మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: 15వ డివిజన్ పరిధిలోని బొల్లిగూడెం కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని మేయర్ సామల బుచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు లేనివారు, ఆధార్ కార్డులో తప్పులు ఉన్న సరి చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని బోడుప్పల్‌నగర పాలక సంస్థ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మగౌడ్, రాసాల వెంకటేశ్‌యాదవ్, సీనియర్ నాయకులు పడతం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌ను పరామర్శించిన విజయశాంతి



రామంతాపూర్: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తండ్రి మురళీధర్‌రావు వైకుంఠ సమారాధన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాజీ ఎంపీ విజయశాంతి రామంతాపూర్ నెహ్రూనగర్‌లోని ప్రభాకర్ స్వగృహానికి చేరుకొని ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోరిగే కృష్ణ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావుతో పాటు ఇతర బీజేపీ నేతలు పాల్గొన్నారు.

అభినందనలు



మల్కాజిగిరి: స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ గోధుమల రాజును ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ కలిసి అభినందనలు తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డిప్యూటీ కమిషనర్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించిన రాజు పదోన్నతి పొందడం సంతోషకరమన్నారు. డీసీని కలిసిన వారిలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గజానన్, సత్యనారాయణ, బాబు ఉన్నారు.


‘టెక్’నాలెడ్జి వైపు..

- కార్పొరేట్‌కు దీటుగా పాఠశాల విద్య బలోపేతమే లక్ష్యం
- శివారు జిల్లాల్లో 1,454 ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు
- ఈ విద్యా సంవత్సరంలో అందజేసేందుకు ఏర్పాట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కార్పొరేట్ విద్యకు దీటుగా సర్కారు విద్యను బలోపేతం చేసేందుకు మన ఊరు-మన బడి కార్యక్రమం కింద అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు వంటి పనులతో బడుల సుందరీకరణ చర్యలు చేపడుతున్న ప్రభుత్వం వాటిని మరింత ఆధునికరించే దిశగా ట్యాబ్‌ల పంపిణీతో ముందడుగు వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థులు.. కరోనా తదితర కారణాల నేపథ్యంలో కనీస సామర్థ్యాన్ని సాధించలేకపోయారని గుర్తించిన సర్కారు ఎఫ్ఎస్ఎన్ కార్యక్రమం కింద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ నేపథ్యంలోనే సర్కారు బడులకు ట్యాబ్‌లు పంపిణీ చేయటంతోపాటు ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఎఫ్ఎస్ఎన్ కార్యక్రమం కింద తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన 19,800 ప్రాథమిక(పీఎస్), ప్రాథమికోన్నత పాఠశాల(యూపీఎస్)లకు విద్యార్థుల సంఖ్యను అనుసరించి ట్యాబ్‌లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 397, రంగారెడ్డి జిల్లాలో 1,057 ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేసే ప్రక్రియలో భాగంగా సంబంధిత విద్యాశాఖలకు వాటిని ఇప్పటికే చేరవేసింది.

బడుల సమాచారం ఇక జాగ్రత్త

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరాయి. అలాగే.. పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల ప్రవేశ రిజిష్టర్లు, రికార్డులు, మార్కుల వివరాలు, ఉపాధ్యాయుల సమాచారం అంతా రాతపూర్వకంగా ఉండటంతో.. కొంత కాలానికి అవసరమైన సమాచారం దొరక్కపోవచ్చనే అనుమానాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే విద్యార్థికి వచ్చిన మార్కులు, సహ పాఠ్యాంశ ప్రణాళిక అమలులో విద్యార్థి ప్రతిభ తదితర విషయాలు, విద్యార్థి ప్రవేశ సంఖ్య, పాఠశాల వదిలివెళ్లిన తేదీ తదితర వివరాలన్నీ ట్యాబ్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు తెలుస్తోంది. వీటి నిర్వహణ, సంరక్షణ బాధ్యత కూడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే మన ఊరు- మనబడి-మన బస్తీ కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడం, బోధనలో నూతనత్వాన్ని పరిచయం చేయడంతో విద్యార్థులు, సమాజం విశ్వాసాన్ని పొందాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇవి మరింత పూర్వ వైభవాన్ని సంతరించుకుంటాయనడంలో సందేహం అవసరం లేదని విద్యా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



సర్కారు బడులకు ట్యాబ్‌ల పంపిణీ

పలకా బలపం నుంచి పెన్ను పేపర్, నోట్‌బుక్స్ వరకు.. బ్లాక్‌బోర్డు నుంచి డిజిటల్ బోర్డులకు మారుతున్న విద్యావ్యవస్థ.. కార్పొరేట్ స్థాయిని తలదన్నేలా సర్కారు స్కూళ్లలో చదివే విద్యార్థుల కోసం ట్యాబ్‌లను తీసుకువచ్చే పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు పలుచోట్ల నూతన భవనాల నిర్మాణం సైతం పూర్తయ్యింది. పేద విద్యార్థులకు డిజిటల్ విద్య అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవడంతో విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్యాబ్‌ల సామర్థ్యమిలా..

- ప్రభుత్వ బడులకు పంపిణీ చేస్తున్న ట్యాబ్ సామర్థ్యం ఇలా ఉంటుందని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.
- దేశీయంగా తయారైన శ్యాంసంగ్ గెలాక్సీ ఏ8 రకం బ్రాండ్,
- 4 జీబీ సామర్థ్యం ఉన్న ర్యామ్,
- 10.8 అంగుళాల నిడివి ఉన్న తెర,
- 7,000 ఎంఏహెచ్ సామర్థ్యం ఉన్న బ్యాటరీ,
- 64 జీబీ మెమరీ తదితర ఆధునిక హంగులతో ట్యాబ్‌లు కలిగి ఉన్నాయి.

ఉపాధ్యాయులకు శిక్షణ

పాఠశాల విద్యకు సంబంధించిన సమాచారాన్ని ప్రస్తుతం ఉపాధ్యాయులు తమ ఫోన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రధానోపాధ్యాయులు ట్యాబ్‌ల ద్వారా బడుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించటానికి అవకాశం ఉంటుంది. వీటి నిర్వహణ విషయంలో ఉపాధ్యాయులకు సంబంధిత నిపుణులతో శిక్షణ కూడా ఇప్పించారు.

అర్హులందరికీ దళిత బంధు ఇవ్వాలి



ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తున్న రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి తదితరులు

- దళిత టీఆర్ఎస్ నాయకులకే పథకం ఇస్తారా..?
- ఎన్నికల్లో దళితులను పావులుగా వాడుకుంటున్నారు
- కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: అర్హులైన ప్రతి ఒక్క దళిత కుటుంబానికి దళిత బంధును అందే వరకు పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. దళిత బంధు అందజేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు పక్షపాత వైఖరిని అవలంబిస్తూ దళిత టీఆర్ఎస్ నాయకుల కుటుంబాలకే అందజేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా చౌరస్తా ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం వరకు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ దళిత కుటుంబాలతో ర్యాలీగా కలిసి వచ్చి తమ నిరసనను తెలిపారు. కార్యాలయ ఆవరణలో బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి దళితబంధు అందజేయాలని నినాదాలు చేశారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలు, ఉపఎన్నికలు వచ్చినప్పుడల్లా దళితులను పావులుగా వాడుకుంటూ ఓటు బ్యాంకు కొల్లగొడుతున్నారే తప్ప దళితులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికలప్పుడు దళితులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తీరని అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. దళిత బంధు కేటాయింపులో పారదర్శకత పాటించాలని, లేనిపక్షంలో ఉప్పల్ ఎమ్మెల్యేను అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. దళిత బంధును ప్రజాప్రతినిధుల కబంద హస్తాల నుంచి తొలగించి కేటాయించే బాధ్యతను జిల్లా కలెక్టర్‌కు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు మేకల శివారెడ్డి, పార్టీ నాచారం డివిజన్ ఇన్‌చార్జి మేడల మల్లికార్జున్ గౌడ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ హెచ్ఆర్ మోహన్, పాలిపాక అంజయ్య, కాలేరు జయ్‌నవీన్, మహ్మద్ రఫిక్, వినోద్ ముదిరాజ్, అబ్దుల్ రషీద్, బూర్గుల రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మచ్చబొల్లారంలో కాంగ్రెస్ జోడో యాత్ర



మచ్చబొల్లారంలో పాదయాత్ర చేస్తున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఆడబిడ్డకు రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ అందజేస్తుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మచ్చబొల్లారం డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ కావాలి, మల్కాజిగిరి ప్రజలకు నందికంటి రావాలని నినాదాలు చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుల డోలి రమేష్, శ్రీనివాస్‌గౌడ్, సీఎల్.యాదగిరి, పవన్, శ్రీనివాస్, సూర్యప్రకాష్‌రెడ్డి, శివకుమార్, రాజు, పాండు, వీనస్‌మేరి, ఫయిమ్, విజయలక్ష్మి, నాజియా తదితరులు పాల్గొన్నారు.

దళితులు ధనికులుగా అభివృద్ధి చెందాలి



నాచారంలో దళిత బంధు యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: దళిత కుటుంబాలు ఆర్థిక ప్రగతిని సాధించాలని, మరో పది మందికి ఉపాధి కల్పించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాచారం ప్రాంతానికి చెందిన తుంగ తిరుపతికి మంజూరైన భువనచంద్ర సిమెంట్, స్టీల్ యూనిట్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు.. బడుగు, బలహీన వర్గాల ప్రజలు తలెత్తుకుని సమాజంలో గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. దళితబంధు పథకం ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు తమ వ్యాపారాలను సక్రమంగా చేసుకుంటూ ఆర్థిక ప్రగతి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, మేకల ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మల్లాపూర్: నాచారం డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు టీకి రాజశేఖర్‌కు గుండె నొప్పి రావడంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్‌శేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్, కట్టబుచ్చన్న రఫీక్, రాజేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: సైబర్ మోసాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీసీపీ అనురాధ, మల్కాజ్‌గిరి డీసీపీ జానకి సూచించారు. శుక్రవారం నాచారం సెయింట్ పాయిస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో సైబర్ స్టాకింగ్, సైబర్ బెదిరింపులపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, జాబ్, లోన్ మోసాలు, ఆన్‌లైన్ మార్కెటింగ్ నకిలీ కస్టమర్‌కేర్, ఇన్వెస్టమెంట్ మోసాల వాటిపై ప్రెజెంటేషన్ ఇచ్చి అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశం, నరేష్‌రెడ్డి, నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే ఊరుకోం..



సాయిరాంనగర్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. సాయిరాంనగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడు పనులను శుక్రవారం ఏఈ రాజ్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేసి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, శ్యామ్, బాలు, శివ, కాలనీ అధ్యక్ష కార్యదర్శులు కందుకూరి వెంకటేశ్వర్లు, సీతారామ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తాచాటిన లిటిల్‌ఫ్లవర్



ఓజస్వీని(490)



అంతర (490)



సారా సిద్దిఖి

ఉప్పల్: సీబీఎస్ఈ ఫలితాల్లో ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ బ్రదర్ జోసెఫ్ తెలిపారు. 155 మంది విద్యార్థులకు గాను 155 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఓజస్వీని, అంతర 490 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. తన్మయి 484 మార్కులు సాధించినట్లు తెలిపారు.

కేంద్రీయ విద్యాలయ-2లో..

ఉప్పల్ కేంద్రీయ విద్యాలయ-2లో 79 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 79 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ ఏఏ ఇజ్రాయిల్ తెలిపారు. సాయి వెంకట రిత్విక్ 462 మార్కులతో 92.4 శాతం పొందినట్లు తెలిపారు. కేంద్రీయ విద్యాలయ-2 ఇంటర్‌లో 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

కేంద్రీయ విద్యాలయ-1లో..

కేంద్రీయ విద్యాలయ-1 సీబీఎస్ఈ పదో తరగతిలో 99 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఇంటర్‌లో 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి తెలిపారు. పదో తరగతిలో అద్వైత్ 96.6 శాతం మార్కులు సాంధించారని తెలిపారు.

ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు

మేడిపల్లి: ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ముద్ర ఉన్నత పాఠశాల డైరెక్టర్ జీవీ రమేష్ అన్నారు. పీర్జాదిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఆరికట్ల హాసిని, జి.అక్షయ, పి.నందిత 10/10 జీపీఏ సాధించగా ఖుషి కావ్య, డి.అఖిల్, ఎంపి.హేమాన్‌విత్, జి.అశ్విత 9.8/10, జి.యోశిక, ఎల్.హర్షిత, పి.హర్షిత, ఎ.వైష్ణవి, సూర్య 9.5/10 సాధించినట్లు వెల్లడించారు. అక్షిత, అనుష్క, ప్రణతి, జశ్వంత్, మణిచరణ్, గణేష్, తేజస్విని 9.3/10, సాయితేజ, స్వనంది 9.2/10, భరత్, యశస్విని 9/10 జీపీఏ సాధించినట్లు తెలిపారు.

జేజీఆర్‌లో 100 శాతం ఉత్తీర్ణత

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ గంగరాజు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. 9.7/10 జీపీఏ సాధించిన సారా సిద్దిఖిని అభినందించారు.



విక్టరీ చూపుతున్న ముద్ర స్కూల్ విద్యార్థులు

ఘనంగా ఎంఆర్ కృష్ణ వర్ధంతి



అల్వాల్‌లో ఎంఆర్ కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ..

అల్వాల్: కేంద్ర మాజీ మంత్రి ఎంఆర్ కృష్ణ 19వ వర్ధంతిని శుక్రవారం అల్వాల్ రాంనగర్ కాలనీలోని సాయిబాబా మందిరం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సాయిబాబా ట్రస్ట్ చైర్మన్ బబ్లూ, వరలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మచ్చేందర్‌రావు హాజరై ఎం.ఆర్.కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. జీవకన్, సీఎల్.యాదగిరి, జేఏసీ నాయకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంధ్యారాణికి డాక్టరేట్



మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరికి చెందిన సంధ్యారాణి డాక్టరేట్ పొందారు. ఇబ్రహీంపట్నంలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ శోభారాణి, డాక్టర్ దుర్గాభవానిల పర్యవేక్షణలో ‘ఫీచర్ సబ్జెక్ట్ సెలక్షన్ బేస్డ్ ఆన్ కాన్సెసెస్ క్లస్టరింగ్’ అంశంపై పరిశోధన చేసినందుకు కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆమె భర్త కూడా గతంలో జేఎన్‌టీయూ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు.

అంకితభావంతో వైద్య సేవలు అందించాలి



నర్సుల దినోత్సవ వేడుకల్లో డాక్టర్ పుట్ల శ్రీనివాస్

బోడుప్పల్: డాక్టర్లు, నర్సులు పేషెంట్‌కు అంకిత భావంతో వైద్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. బోడుప్పల్ యూపీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నర్సులు తమ అంకితమైన అవిశ్రాంత నిస్వార్థ సేవలకు గుర్తింపుగా వారిని గౌరవించుకోవడం అందరి బాధ్యత అన్నారు. కేక్ కట్ చేసి నర్సులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ సరస్వతి, బోడుప్పల్ వైద్యాధికారి డాక్టర్ రవీంద్రబాబు, డీపీహెచ్ఎన్‌వో శేషు పద్మ, నర్సులు పాల్గొన్నారు.

తెలంగాణ క్రీడా ఖ్యాతిని చాటి చెప్పాలి



క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత, ఈఈ నాగేందర్

ఉప్పల్: తెలంగాణ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో ఎల్బీనగర్ జోనల్ స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్‌లో భాగంగా శుక్రవారం క్విజ్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ క్రీడా ఖ్యాతి చాటి చెప్పేలా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, అనిల్, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.